# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 13-04-2016**

భద్రాచలం ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అనువైన ప్రణాళిక సిద్దం చేయాలని స్థపతి, దేవాదాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై క్యాంపు కార్యాలయంలో బుధవారం సిఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి ఎ.ఇంద్రకరణ్ రెడ్డి, స్థపతి వల్లి నాయకం, దేవాదాయ శాఖ సిఇ కె.వెంకటేశ్వర్లు, ఆలయ నిర్మాణ రూపకర్తలు ఆనంద్ సాయి, రవి, మధుసూదన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయం ప్రస్తుతమున్న పరిస్థితి, కళ్యాణ మంటపం, మాడ వీధులు, ప్రాకారం, పరిసర ప్రాంతాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ధర్మపురి, కాళేశ్వరం సహా గోదావరి నది ఒడ్డున వున్న బాసర నుంచి భద్రాచలం వరకు అన్ని ప్రముఖ ఆలయాలను సర్వతోముఖాభివృద్ధి చేయాల్సి ఉందని అన్నారు. ప్రముఖ యాత్రా స్థలాలుగా పేరున్న ఈ దేవాలయాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు, ముఖ్యమైన ఉత్సవాల సందర్బంగా కార్యక్రమాలు నిర్వహించడానికి అనువుగా ప్రాంగణాలను సిద్దం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. భద్రాచలం దేవాలయంలో అటు భక్తులకు, ఇటు దైవ సంబంధ కార్యక్రమాలకు అనువుగా నిర్మాణాలను తీర్చిదిద్దాలన్నారు. గోదావరి నది ఒడ్డున నిర్మించిన కరకట్ట, దేవాలయం మధ్యన ఉన్న ప్రాంతమంతా పరిగణనలోకి తీసుకొని కొత్త డిజైన్లు రూపొందించాలన్నారు. భక్తులు సులభంగా తిరిగే విధంగా విశాలమైన ప్రాంగణం ఉండాలని, శ్రీరామ నవమితో పాటు ముఖ్యమైన కార్యక్రమాలు జరిగేందుకు అనువుగా విశాలమైన కళ్యాణ మంటపం నిర్మించాలన్నారు. ప్రస్తుతం వున్న ప్రధాన ఆలయ గర్భ గుడిని

యథాతథంగా వుంచుతూనే భక్తుల సౌకర్యం కోసం మెరుగైన ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం ప్రణాళిక రూపొందించాలన్నారు.

ప్రస్తుతం ఉన్న ప్రాకారం సరిపోతుందా? మరొకటి నిర్మించాలా? అనే అంశంపై అధ్యయనం చేయాలన్నారు. దేవాలయం చుట్టూ వున్న రహదారులను మాడ వీధులుగా తీర్చిదిద్దే అంశం పరిశీలించాలన్నారు. మహాలక్ష్మి, అండాళ్ అమ్మవార్ల దేవాలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పర్ణశాల, చిత్రకూట మంటపం, జటాయువు మంటపం తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. స్థపతి, ఆలయ నిర్మాణ రూపకర్తలు, ఆగమ శాస్త్ర పండితులు కలిసి పనిచేసి చిన్న జియర్ స్వామి సూచనలతో సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. శ్రీరామ నవమి ఉత్సవాల తరువాత తాను కూడా మరో సారి భద్రచాలం వెళ్లి అక్కడ చేయాల్సిన మార్పులు, చేర్పులపై క్షేత్ర స్థాయి పరిశీలన జరుపుతానన్నారు. యాదగిరి గుట్ట మాదిరిగానే భద్రాచలాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. విశాలమైన, అందమైన ఉద్యానవనాలు, అన్ని సౌకర్యాలతో కూడిన కాటేజీలు నిర్మించాలని చెప్పారు.

**సిపిఆర్ఓ టు సిఎం**